వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

– జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి ఈ నెల 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎ.వినోద్ కుమార్ తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ పొందే గిరిజన బాలబాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, షూస్‌తో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 1 నాటికి 9 నుంచి 11 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలబాలికలు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు.

ప్రజావాణిలో 98 అర్జీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 98 అర్జీలను జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి డీఆర్వో హరిప్రియ స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ.. వీటిని పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరంలోని బేగంపేట్, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మేడ్చల్– మల్కాజిరి జిల్లావాసులై ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. ఆదాయ, నివాస, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత తహసీల్దారులచే జారీ చేయబడి ఉండాలన్నారు. అభ్యర్థి 01 జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్య జన్మించి ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి హాల్‌లో 'డ్రా' తీస్తారన్నారు.

9న కండ్లకోయకు సీఎం రేవంత్‌రెడ్డి



కండ్లకోయ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: ఈ నెల 9వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో పర్యటిస్తారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. కండ్లకోయలో 9 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఐటీ పార్క్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. గత ప్రభుత్వం పునాది వేసి పార్క్‌ను పట్టించుకోలేదని తమ ప్రభుత్వం పార్క్‌ను పూర్తి చేస్తున్నామని, 9వ తేదీన సీఎం ప్రారంభిస్తారని తెలిపారు.

సభాస్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..

కండ్లకోయ ఐటీ పార్క్ వద్ద సీఎం సభను నిర్వహించడానికి కాంగ్రెస్ నాయకులు స్థలాన్ని పరిశీలించారు. పార్క్‌కు కేటాయించిన 9 ఎకరాల స్థలంలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, నాయకులు వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల నాయకులు కొలను హన్మంత్ రెడ్డి, జ్యోష్న శివారెడ్డి, బండి రమేష్, నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను కించపరిచేలా ప్రభుత్వ నిర్ణయాలు



సునీత

శామీర్‌పేట్: అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సునీత అన్నారు. సోమవారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు పత్రికల్లో వచ్చిందని, ఈ నిర్ణయం తమ ఉద్యోగులను కించపరిచేలా ఉందని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కేవలం ప్రజల కోసం నిరంతరం సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను దొంగలుగా చిత్రీకరించే నిర్ణయాలు దుర్మార్గమని ఆమె మండిపడ్డారు. ఇకనైనా ఐసీడీఎస్ బలోపేతం, అంగన్‌వాడీ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

ఉపాధి కోసం వచ్చి అదృశ్యం



వెంకటేశ్వర్‌రావు (ఫైల్)

మేడ్చల్: ఉపాధి కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కాకర్లపల్లి మండలం నుంచి మైలవరపు వెంకటేశ్వర్‌రావు(63)మేడ్చల్ మండలం సోమారం గ్రామానికి వలసొచ్చారు. అక్కడ కెనాల్ పనులు చేస్తూ స్థానిక రెండు పడకల ఇళ్లలో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం పనులు ముగించుకొని గదిలోకి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. ఉదయం ఆయన కనిపించలేదు. దీంతో అతడి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడితో కలిసి వలస వచ్చిన రాఘవ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భోజనంలో పురుగులు.. విద్యార్థినుల ఆందోళన

– మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో ఘటన





మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి గ్రూప్స్ విద్యా సంస్థల హాస్టల్‌లో భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థినుల ఆందోళన సోమవారం రాత్రి మరోమారు పునరావృతం అయ్యింది. మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ గర్ల్స్ హాస్టల్‌లో సోమవారం రాత్రి డిన్నర్ చేసే విద్యార్థినుల భోజనంలో పురుగులు రావడంతో వారు ఆందోళన చేశారు. ఇటీవల మల్లారెడ్డి యూనివర్సిటీ మహిళల హాస్టల్‌లోని భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థినులు, విద్యార్థి సంఘాలు నాలుగు రోజుల పాటు ఆందోళన చేయగా చివరకు మల్లారెడ్డి గ్రూప్స్ చైర్మన్, మాజీ మంత్రి మల్లారెడ్డి విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి వారితో మాట్లాడి మరోమారు పునరావృతం కాకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ ఘటన మరువక ముందే మరోమారు భోజనంలో పురుగులు రావడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎంఎంటీఎస్ ట్రైయిన్

ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్..

ఫుల్‌ఖుష్..

ఎన్నో ఏళ్ల కల.. సాకారమవుతున్న వేళ.. ఈ ప్రాంతవాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తక్కువ ఖర్చుతో వివిధ ప్రాంతాలకు ఎంఎంటీఎస్ ట్రైయిన్‌లో హ్యాపీగా జర్నీ చేయవచ్చని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉండటంతో రానున్న రోజుల్లో మరిన్ని వచ్చే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులతో పాటు ఎంతో మందికి ఈ ట్రైయిన్ ఉపయోగకరంగా ఉంటుందని వారు అంటున్నారు.

- నేడు ఎంఎంటీఎస్ ట్రైయిన్ షురూ..
- సాఫీగా ప్రయాణం సాగించే అవకాశం
- హర్షం వ్యక్తం చేసున్న ప్రయాణికులు

ఘట్‌కేసర్: మౌలాలి నుంచి ఘట్‌కేసర్ వరకు చేపట్టిన ఎంఎంటీఎస్ పొడగింపు పనులు పూర్తయ్యాయి. రెండవ దశలో మౌలాలి–ఘట్‌కేసర్ మధ్య ఉన్న 12.2 కిలో మీటర్ల ట్రాక్ మరమ్మతులు, విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు. 2018 డిసెంబర్ నాటికి ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న నాటి రాష్ట్ర సర్కారు నిధులు కేటాయించకపోవడంతో అడుగు ముందుకు పడలేదు. ఎంఎంటీఎస్ నిర్మాణ సంస్థ రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) ఆధ్వర్యంలో రెండో దశలో ఘట్‌కేసర్ వరకు పొడగించాలని కేంద్రం ఈ ప్రాజెక్టు చేపట్టింది. లింగంపల్లి–ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రాకతో రవాణా సౌకర్యం పెరుగుతుందని ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎంటీఎస్‌తో పేదలకు మేలు..

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నగరానికి సమీపంలో ఉండటంతో విద్య, ఉపాధి కోసం ఇతర జిల్లాల నుంచి వలసలు పెరిగాయి. దీనికి తోడు వందలాది కాలనీలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఇన్ఫోసిస్, రాహేజా వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థల రాకతో జనాభా విపరీతంగా పెరిగింది. కేంద్రం చొరవ చూపి ప్రారంభించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంగారెడ్డిలో వర్చువల్‌గా..

లింగంపల్లి–ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రైలు రాకతో పేదలకు మేలు జరుగుతుందని, ప్రయాణికుల డబ్బు సమయం ఆదా అవుతుందని అంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే వాళ్లు హఫీజ్‌పేట్, చందానగర్, గచ్చిబౌలి, బోరబండ, హైటెక్‌సిటీ రాకపోకలకు సులువుకానుంది. భారత ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఉదయం సంగారెడ్డిలో వర్చువల్‌గా రైలును ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో డీఆర్ఎం భవతీప్ కుమార్ జైన్, ఏసీఎం రవికాంత్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి ఎంఎంటీఎస్ ట్రైయిన్‌కు జెండా ఊపి ప్రారంభించనున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రైయిన్ కూడా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది.

ఘట్‌కేసర్ అభివృద్ధి చెందుతుంది



ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్ రైలు రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ప్రయాణికుల రాకపోకలు పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇన్ఫోసిస్, రహేజా వంటి అంతార్జాతీయ సంస్థలు మరిన్ని వస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. రియల్ ఎస్టేట్ రంగం కూడా పరుగులు పెడుతుంది.

– చలువాది ప్రవీణ్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఘట్‌కేసర్

పేదలకు ఎంతో మేలు..



ఘట్‌కేసర్–లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు రాకతో పేదలకు మేలు జరుగుతుంది. తక్కువ టికెట్‌తో ప్రయాణించే అవకాశం పేదలకు కలుగుతుంది. డబ్బు, సమయం కూడా ఆదా అవుతుంది. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణం సాగుతుంది.

– విప్పర్ల హనుమాన్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఘట్‌కేసర్

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం



రావల్‌కోల్‌లో మల్లన్న జాతరలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో నిర్వహిస్తున్న మల్లిఖార్జున స్వామి జాతర మహోత్సవంలో సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి కల్యాణ మహోత్సవం, అగ్ని గుండాలు కార్యక్రమాల్లో నాయకులతో కలిసి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా గ్రామస్తులు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మేడ్చల్ వైస్ ఎంపీపీ వెంకటేశం, మాజీ సర్పంచ్ మహేందర్, మాజీ ఎంపీటీసీ మామిండ్ల వెంకటేశ్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ రాజారాం, నాయకులు హరత్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి మల్లన్న ఆలయంలో మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

చీర్యాల, కీసర దాయర గ్రామాల్లో..

కీసర: చీర్యాల, కీసర దాయర గ్రామాల్లో సోమవారం మల్లన్న దేవాలయాల వద్ద సోమవారం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు మల్లన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కీసరదాయర మల్లన్న కల్యాణోత్సవం సందర్భంగా రామిడి స్వప్న విజయ్‌రెడ్డి భక్తులకు అన్నదానం నిర్వహించారు.



గౌడవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో నేతలు



మల్లన్న కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

నూతన సీఐ నాగరాజుకు శుభాకాంక్షలు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ నూతన సీఐ నాగరాజును సోమవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రాంచందర్, రెడ్డిశెట్టి మహేష్, సింగన్న బాలరాజు, సిద్దులు యాదవ్, రాజు, భూమాపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో సమస్యలు పరిష్కరించండి

మల్కాజిగిరి: ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ డీసీ రాజును కోరారు. డివిజన్ పరిధిలోని కొన్ని కాలనీల్లో ఆస్తిపన్ను ఎక్కువగా వచ్చిందని సమస్య పరిష్కరించాలన్నారు. ధరణికాలనీలోని శ్మశానవాటికలో డెత్ సర్టిఫికెట్ తీసుకోవడానికి రశీదు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రీన్ వేస్ట్ లిఫ్టింగ్ కోసం అదనపు వాహనాన్ని కేటాయించాలని, దుర్గానగర్ నాలా డీస్టింగ్ పనులు చేపట్టాలని కోరామన్నారు.

మధ్యాహ్నం భోజన కార్మికుల ధర్నా

- జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్
- స్కూళ్లకు గ్యాస్ ఫ్రీగా సరఫరా చేయాలని వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: జీతాలను ప్రతినెలా సక్రమంగా అందజేయడంతో పాటు బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్క్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే.ఉన్నికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యపై వెంటనే స్పందించి, పరిష్కరించాలని కోరారు. నాలుగు నెలల నుంచి గుడ్లు, కూరగాయ బిల్లులతో సహా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వ బకాయిలు పేరుకుపోగా, వీటిని తీర్చడానికి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వడ్డీ చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ రూ.500 గ్యాస్ ఇస్తానంటుందోనని, అలాగే, ప్రతి ప్రభుత్వ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల గుడ్లు, కూరగాయలు, కిరాణం బిల్లులతో సహా జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రేమలత, నాయకులు ఆర్.శ్రీనివాస్, ఎం.పుష్పాలత, పద్మ, హేమ, విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.



100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఆరో వార్డులో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజల విన్నపం మేరకు లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా నూతనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, త్రీఫేజ్ కేబుల్‌ను ఏర్పాటు చేశామన్నారు. కౌన్సిలర్ నస్రీన్ సుల్తానా, ఏఈ సతీశ్‌కుమార్, నాయకులు సిరాజ్, అయూబ్, రహీం, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఏదైనా తప్పిదం వల్ల కరెంటు బిల్లు, యూఎస్‌సీ నంబర్, గ్యాస్ బిల్లు నంబర్, ఏదైనా ఇతర తప్పులు ఉంటే నాగారం మున్సిపల్ కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మేనేజర్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులపై ఆరా



ఘట్‌కేసర్: అవుషాపూర్ వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో నేషనల్ హైవే అధికారులు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను ఆ గ్రామ మాజీ సర్పంచ్ కావేరిమశ్చేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అవుషాపూర్‌లో సర్వీస్ రోడ్డులో ప్రమాదాలు జరుగకుండా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆమె గతంలో నేషనల్ హైవే అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆమె వినతి మేరకు అధికారులు మరమ్మతులు చేపట్టారు.

మండల పరిషత్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం



మేడ్చల్: ప్రభుత్వ పథకాలు అందని వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి ప్రారంభించారు. పథకాలు అందని వారు, గతంలో దరఖాస్తు చేసుకోని వారు కేంద్రంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ఆద్రాస్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం



శామీర్‌పేట్: మండల కేంద్రమైన మూడుచింతలపల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో ఊపిరితిత్తులు ఇతర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 132 మందికి పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు దేవిక, జాహ్నవి, కుషలు, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, కవిత పాల్గొన్నారు.

ఆ ఇళ్లకు నంబర్లు ఇవ్వం

కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల్లో నూతనంగా నిర్మించే ఇళ్లకు నంబర్లు కేటాయించేది లేదని కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పేద ప్రజలకు అమ్ముతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జవహర్‌నగర్‌లో సర్వే నంబర్లు: 244–249, 426, 436, 442–467, 473, 479–492, 494, 497, 510–521, 523–527, 584, 606/2, 607/610 లలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించేది లేదని తెలిపారు. కలెక్టర్ ద్వారా నో అబ్జెక్షన్ ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే ఇంటి నంబర్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో బాబుమోహన్



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో సోమవారం మాజీ మంత్రి, సినీనటుడు బాబుమోహన్ పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన బాబుమోహన్ మొదట లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఇటీవల కొత్తగా నిర్మించిన గంగా భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలోని శివలింగానికి స్వయంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



కీసర: పశుపోషణ చేపడుతున్న పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని కీసర మండల వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి అన్నారు. సోమవారం భోగారం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పశువైద్యుడు రవిప్రకాష్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.